# కల్యాణి

కల్యాణి నాకు చిన్నప్పటి నుండి తెలుసు. మా పక్కవీథిలోనే వాళ్ళిల్లు. మా మేడెక్కి చూస్తే వాళ్ళిల్లు కనిపిస్తుంది. వాళ్ళది చిన్న ఇల్లు కాని పెద్ద లోగిలి. వాళ్ళ నాన్నమ్మ, వాళ్లమ్మ, వాళ్ళ అన్నయ్య. వీళ్ళే ఇంట్లో సభ్యులు.

స్వంత వ్యవసాయం ఉన్నందున ఇల్లు ఎప్పుడూ హడావుడిగానే కనిపించేది. లోగిట్లో ఆవులు, గేదెలు, కాస్త ఎడంగా పందిట్లో ఎద్దులు. ఆ పైనే గడ్డి వాములు. ఒకరిద్దరు జీతగాళ్ళు. ఇటూ అటూ తిరుగుతూ ఇంటిల్లిపాదీ ఏదో ఒక పనిలో ఉన్నట్లే కనిపించేవాళ్ళు.

మా పిల్లలందరికీ వాళ్ళింట్లో ఆకర్షణ ఒక సపోటా చెట్టు, మరో రబ్బరు చెట్టు. మరెవ్వరిళ్ళలోనూ ఉండేవి కావు. రబ్బరు పాలు తీసి ఉడకబెడ్తే రబ్బర్లు అవుతాయని అనుకొనేవాళ్ళం. కానీ ఆ ప్రయోగం చేయటానికి అవకాశం ఏనాడూ రాలేదు. చాటుమాటుగా ఒక రబ్బరు ఆకు తుంచినా అందులోని ఒకటి రెండు చుక్కల పాలవల్ల వచ్చే లాభమేమీ కనిపించలేదు. కాకపోయినా ఆ చెట్లు చిన్న కాంపౌండ్ గోడకు లోపలగా ఉండేవి. మేమివతల నుండి గెంతి, గెంతి ఒక ఆకో రెమ్మో కోయగలిగే వాళ్ళం. కల్యాణి వాళ్ళ నానమ్మ చూస్తే మాత్రం తిట్లు, శాపనార్థాలు. అంతేగాక కర్ర పుచ్చుకు తరిమేది. అసలు ఆమె చేతిలో ఎప్పుడూ కర్ర ఉండేది. ఇక సపోటా కాయల విషయానికి వస్తే, పచ్చివైనా సరే కింద రాలినవి ఏరుకొనే వాళ్ళం. అవే కొరికి వగరయి పారేసే వాళ్ళం. ఎప్పుడైనా స్కూలు నుండి వస్తూ మంచి నీళ్ళ నెపంతో వాళ్ళింట్లోకి వెళ్ళాలని చూసేవాళ్ళం. "ఎన్ని మైళ్ళనుండి వస్తున్నారు? ఎన్ని మైళ్ళ దూరం వెళ్ళాలి? ఇండ్లకు వెళ్ళి తాగలేరూ దొంగ వేషాలు కాకపోతే" అని అరిచేది ముసలమ్మ.

కల్యాణి వాళ్ళమ్మ ఎప్పుడూ ఇల్లు దాటి వచ్చేది కాదు. గుమ్మంలో కనిపిస్తే మాత్రం "నువ్వు శకుంతల కూతురివి కదూ! మీ అమ్మ బాగుందా?" అని పలకరించేది. లేకపోతే "ఏం చదువుతున్నావు? పరీక్షలా?" అంటూ ఏదో ఒక మాట అనేది.

కల్యాణి మా వయసు పిల్లే కానీ మాతో ఏనాడూ కలిసేది కాదు. ఆడేది కాదు. నేనే ఒకసారి వాళ్ళమ్మనడిగాను "కల్యాణి బడికి రాదెందుకు?"అని.

"అది రాదులే" అని ముభావంగా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. ఆ పిల్ల కూడా లోపలినుంచి మమ్మల్ని తొంగి చూసేది కాని దగ్గరకు వచ్చేది కాదు.

మా మేడ మీద సాయంకాలం జాజిపూలు కోసుకొంటూనో, స్నేహితురాండ్రతో కబుర్లు చెబుతూనో లేదా ఉట్టినే దిక్కులు చూస్తూనో ఉన్నప్పుడు నాకు కల్యాణి కనిపించేది. ఆవు దూడలను నిమురుతూ. కుక్కపిల్లతో ఆడుకుంటూ ఉండేది. ఒక్కోసారి మధ్యాహ్నం చెట్టు కింద ఒంటరిగా కూర్చుని కనిపించేది.

మా అమ్మను ఒకసారి అడిగాను "కల్యాణి స్కూలుకు రాదెందుకమ్మా?"

"కల్యాణి ఎవరే?"

"అదిగో ఆ సపోటా చెట్టుందే వాళ్ళింటి అమ్మాయి."

"ఓహో! రాధ కూతురా? అది చాలా దురదృష్టవంతురాలు. అది మూగది... చెవుడు... పైగా రూపురేఖలు అలాగే ఉన్నాయి."

ఆ రోజుల్లో రూపురేఖల గురించి నాకేమంత తెలిసేది కాదు. మూగపిల్ల కాబట్టి చదువుకోకపోవటం చాలా సహజమనిపించింది. కాని ఆడుకోవచ్చు గదా! సైగలతో ఎన్ని ఆటలైనా ఆడుకోవచ్చు. మా స్కూల్లో రమణయ్య మూగవాడే కదా! ఎంత నవ్విస్తాడు మమ్మల్ని? ఎంత ఆడిస్తాడు! మాకు మంచినీళ్లు తెచ్చి పెట్టడం, గంట కొట్టటం, ఏవో కాగితాలు, పుస్తకాలు తీసుకురావటం, తీసుకుపోవటం అన్నీ చేస్తుంటాడు. హెడ్మాస్టరుకు కావలసిన పనులన్నీ తనే చేస్తాడు. మేమెవరమయినా స్కూలుకు వెళ్ళకపోతే ఇంటికి వచ్చి మమ్మల్ని వెంట తీసుకెళ్ళేవాడు.

ఎలిమెంటరీ స్కూలై, హైస్కూలుకు వెళ్ళాక కల్యాణి గురించి అంత పట్టించుకోవడం మానేశాను. అప్పుడప్పుడు వాళ్ళింటివైపు యథాలాపంగా చూస్తే కనిపిస్తూనే ఉండేది.

నేను ఇంటర్మీడియట్‌లో ఉండగా మా అక్క పెళ్ళి కుదిరింది. చుట్టు పక్కల ఉన్న ఇళ్ళకు పెళ్ళి కార్డులు ఇవ్వాల్సిన పని నాకు అప్పజెప్పారు. అప్పుడే కల్యాణి వాళ్ళింటికి వెళ్ళాను. అప్పటికే ముసలమ్మ చనిపోయింది. కల్యాణి వాళ్ళమ్మ ఎదురయింది. నన్ను ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళింది. చాప వేసింది.

పాత కాలం నాటి మిద్దెలు. గారతో కట్టిన ఇండ్లు. నేల కూడా సిమెంటుది కాదు. బండరాళ్ళు పరిచి ఉన్నాయి. అప్పుడు కల్యాణిని దగ్గరగా, స్పష్టంగా చూశాను.

ఒక విధమైన వికృత రూపం ఆమెది. పై పెదవి సగం లేదు. పళ్ళు బయటకు కనిపిస్తుంటాయి. ముక్కు నామ మాత్రంగా ఉంది. పెద్ద పెద్ద రంధ్రాలు. కళ్ళు మాత్రం పెద్దగా మిల మిలలాడుతున్నాయి.

వాళ్ళమ్మ మా అక్కకు కుదిరిన సంబంధం గురించి వివరాలు అడిగింది. చివరకు నిట్టూరుస్తూ "శకుంతల అదృష్టవంతురాలు. ముత్యాల్లాంటి బిడ్డలు. చక్కటి చదువులు. నువ్వింకా పై చదువులు చదువుతావేమో కదూ! మొన్నటి పిల్లవు ఎంత త్వరగా ఎదిగిపోయావు. మా కల్యాణికీ నీకూ ఒక ఏడాది తేడా ఉందేమో! అంతే. కానీ దాని రాత చూడు."

"కల్యాణిని ఏదో ఒక స్కూల్లో చేర్పించి ఉండాల్సింది అత్తా. మనం కనుక్కోలేదు కాని మూగ పిల్లలకు స్కూళ్లు ఎన్నో ఉన్నాయి" అన్నాను మెల్లగా.

"ఆ సంగతులెందుకులే అమ్మా. దాని రూపం చూశావు కదా. దాని వయసుకు తగిన తెలివితేటలూ లేవు. అది పుట్టినప్పటి నుండి ఇప్పటి వరకు కడుపులో నిప్పు పెట్టుకొని తిరుగుతున్నట్టుంది. చిన్నపిల్లవు ఇవన్నీ నీకేమర్థమవుతాయి. నేనెన్ని బాధలు పడ్డానో, దానిని కనుమరుగు కాకుండా ఎలా కాపాడుకొన్నానో ఆ భగవంతుడికెరుక. అది పుట్టటం, ఇటు వాళ్ళ నాన్న ఎద్దు పొడిచి చావటం, పది మందీ అనే మాటలు... ఆ బాధలు నరకమంటే నరకమే. ఏనాటి పాపమో మూటగట్టుకొన్నాను కనుక మోస్తున్నాను. ఇటువంటి పుట్టుకల వల్ల ఏం ప్రయోజనం? మనల్ని నానా యాతనలు పెట్టడం గాక ఆ పరమాత్ముని కింకేమయినా ఉద్దేశముందంటావా?"

నేనేం మాట్లాడలేక పోయాను. అసలు ఆమె నాతో మాట్లాడటంలేదు. తనలో తనే మాట్లాడుకొంటున్నట్టుంది.

"వస్తానత్తా. ఇంకా ఎన్నో ఇండ్లకు వెళ్ళాలి. మీరందరూ తప్పకుండా పెళ్ళికి రండి" అంటూ ఇల్లంతా కలయజూశాను. కల్యాణి నవ్వుతూ మల్లెపూలు తెచ్చి ఇచ్చింది. ఆ ఇకిలింపు చూడలేనంత వికృతంగా ఉంది.

"తీసుకోమ్మా! ఇందాకే పూలు కట్టి పెట్టాను" అంది కల్యాణి వాళ్ళమ్మ. "ఇంట్లో పెట్టుకొనే వాళ్ళెవరూ లేరు. దేవుని పటానికి వేసుకోవటమే."

నేను దండ కొంచెం తుంచి కల్యాణి జడలో పెట్టాను. తను వెంటనే లాగేసి ఒక్కొక్క పువ్వూ విడదీయ సాగింది ఏవో శబ్దాలు చేస్తూ. ఆ పని చేస్తున్నంత సేపూ ఇకిలిస్తూనే ఉంది.

పెళ్ళి సందడి, ఆ తర్వాత పరీక్షలు. నాకింకేమీ పట్టలేదు. ఒకరోజు నేను మా ఫ్రెండు దగ్గరకు వెళ్ళి వచ్చేసరికి నాన్న గారి దగ్గర ఒకరిద్దరు కూర్చొని ఉండటం చూశాను. శివాలయం పూజారి, మరోవ్యక్తి, కాషాయ బట్టల్లో సాధువులా ఉన్నాడు.

"ఆ బండరాయి ఎన్నాళ్ళుగానో అక్కడ పడుంది. ఎవరూ దానిని పట్టించుకోలేదు. ఇప్పుడు దాని అవసరమేమొచ్చింది?" అంటున్నారు నాన్నగారు. నన్ను చూడగానే "చిన్న పాపా, స్వామి వాళ్ళు వచ్చారు. కొంచెం పాలు పట్టుకురామ్మా" అన్నారు. నేను వంటింట్లోకి వెళ్లాను. "ఏమిటమ్మా బండరాయి అంటున్నారు?" అని అడిగాను.

"అదే లేవే మన గడ్డివాముల దగ్గర లేదూ, వేప చెట్టు కింద."

"ఓ ఆ గుండా? ఇప్పుడేమిటట?"

"దానిలో దైవాంశ ఉందంటున్నాడు పూజారి వెంట వచ్చిన సాధువు."

రెండు గ్లాసుల పాలూ, అరటి పళ్ళూ పళ్ళెంలో పెట్టి ఇచ్చింది అమ్మ.

నాకు నవ్వు వచ్చింది. ఈ స్వామి ఏదో బోల్తా కొట్టిస్తున్నాడు. లేకపోతే ఆ బండరాయి ఏమిటి, దైవాంశ ఏమిటి? దానికి ఒక షేపు అంటూ లేదు. గరుకు గరుకుగా ఉంటుంది. కూర్చోటానికి కూడా వీలుండదు. దాని చుట్టూ మేము గెంతే వాళ్ళం. దాగుడుమూతలు ఆడేవాళ్ళం. దానిపైన ఉమ్మామో, దానిని తన్నామో, రాళ్ళతో కొట్టామో చెప్పడం కష్టం. అసలు మేమారాతిని ఏనాడూ ప్రత్యేకంగా పట్టించుకోలేదు.

నేను వెళ్ళేసరికి బయటి ఊరి నుండి వచ్చిన స్వామి అంటున్నాడు. "నిన్న అనుకోకుండా మీ గడ్డివాముల వైపు వెళ్ళామండి. ఈ రాయి కనిపించింది. చూడగానే స్వయంభు అని తెలిసిపోయింది."

"ఎన్నేళ్ళుగా పడుందో మాకు తెలీదు. దానివల్ల మాకు ఏ ప్రయోజనమూ లేదు. దాన్నిప్పుడు మీరు విగ్రహంగా చేస్తారా?" అని అడిగారు నాన్నగారు.

"అబ్బే లేదండీ. అది విగ్రహానికి పనికిరాదు" అన్నాడు స్వామి.

"అసలది దేనికీ పనికిరాదు. దానిని అక్కడి నుండి కదిలించే వీలు లేక వదిలేశాం. ఇంతకూ ఏం చేద్దామంటారు?" అన్నారు నాన్నగారు.

"మనం ఉన్న దానిని ఉన్నట్లుగానే స్వీకరించాలి. అది దైవ ప్రసాదం. చూడండి నేను జ్యోతిశ్శాస్త్ర, ఖగోళశాస్త్రం చదువుకొన్న వాడిని. ఇది మామూలు రాయి కాదు. ఎన్నో వేల సంవత్సరాలుగా మన పూర్వీకులకు దారి చూపిన నక్షత్ర భాగమిది. దీని విలువ అమూల్యం?"

"మరి అంత వికారంగా ఉందే?" అన్నాను నేను.

ఆయన అతి కాంతిమంతమైన కళ్ళతో నన్ను చూసి నవ్వారు. "పాపా! అది అలౌకిక సౌందర్యం. అత్యంత సుందర రూపంలో ఈశ్వరాంశ ఉన్నట్లే అతి వికృత రూపంలో కూడా ఈశ్వరాంశే ఉంటుంది. సాన పెట్టని వజ్రంలాంటి సౌందర్యమది. మన విలువలతో అంచనా వేయకూడదు. మన అల్ప ప్రయోజనాలకు అది పనికిరాదు. నిజమే కాని అది అల్పమైనది కాదు. దానిని గుర్తించక పోవటమన్న దోషం మనది కానీ ఆ వస్తువుది కాదు."

ఆ క్షణంలో వికృతంగా నవ్వుతున్న కల్యాణి గుర్తుకు వచ్చింది. తను అపురూపమైనదని గుర్తించలేకపోవటం మన లోపమే గాని తనది కాదు.

10 ఏప్రిల్ 1998